# "సింహం నవ్వింది"

నేను వెళ్ళాల్సిన బస్సు అప్పుడే స్టాండు నుండి బయలుదేరుతోంది.

ఏమాత్రం ఆలస్యం చేయకుండా పరుగులు తీసి దాన్నందుకుని సీటులో కూలబడ్డాక, "హమ్మయ్య" అంటూ ఊపిరి పీల్చుకున్నాను. మా ఆవిడ వంట పుణ్యమా అని ఈ పొద్దు ఇంతాలస్యమైంది. టైము చూసుకు న్నాను. పదిన్నరకు ఆరు నిమిషాలు తక్కువ ఉంది. మరో పదహైదు నిమిషాలకు కానీ నేను ఉద్యోగం వెలగబెడుతోన్న ఊరు రాదు. ఆఫీసుకి లేటుగా వెళ్ళినందుకు, మా ఆఫీసరు చూడబోయే వేడివేడి చూపులూ, వాడబోయే వాడివాడి మాటలూ జ్ఞాపకం వచ్చి నా వెన్నులో సన్నని వణుకు ప్రారంభమైంది.

మా ఆఫీసరు గురించి ఒక ముఖ్యమైన విషయం చెప్పాలంటే కొంచెం మాటల కసరత్తు చేయాలి!

'భూమి బల్లపరుపుగా ఉందని' ఎవరైనా చెబితే నమ్ముతాను.

'అర్ధరాత్రి వేళ ఒక ఆడది ఒంటరిగా తిరిగి రాగల కాలం వచ్చింది' అని ఎవరు చెప్పినా నమ్ముతాను.

'భారతదేశంలో ఈవాల్టి నించీ కులాలూ, మతాలూ పోయి అందరూ ఒక్కటయి పోయారు' అని మానవమాత్రుడు చెప్పినా నమ్మేయడమే'.

'పులులూ, సింహాలూ ఇక నించీ శాకాహారులుగా మారి, పచ్చగడ్డి తింటాయంట' అని మాటమాత్రంగా చెప్పినా నమ్ముతాను.

అయితే -

మా ఆఫీసరు నవ్వాడంటే మాత్రం నేను ఛస్తే నమ్మను గాక నమ్మను. నేను కాదు కదా 'మా ఆఫీసులో.. సారీ, మా డిపార్టుమెంటులో మెదడనే పదార్థం తలలో ఉన్న వాడెవ్వడూ నమ్మడు.. అదీ, మా ఆఫీసరంటే.

"ఏం? ఎందుకనీ నవ్వడు' అంటూ అడగబోతారు మీరు.

మా ఆఫీసరుకు నవ్వు అంటే ఏమిటో తెలీదు. అసలు అతనికి 'నవ్వు'కు స్పెల్లింగు తెలుసో, లేదో

నాకు మాత్రం తెలీదు. మా ఆఫీసరుకి సొంతానికంటూ ఒక నిఘంటువుంటే, అందులో 'నవ్వు' అన్న పదమే ఉండి ఉండదు.

నవ్వడం రాదూ అంటే అతనికి చాలా విషయాలు వచ్చి ఉండవు, అని ఎవరైనా అంటు మటుకూ, పప్పులోనో, తప్పులోనో కాలేసినట్టే లెక్క!

అవును -

ఆయనకి కళ్ళతో చురచుర చూడడమొచ్చు !

మొహం మలమల మాడ్చుకోవడం వచ్చు !

పళ్ళు పటపట కొరకడం వచ్చు !

ఎదుటి మనిషి హడలి చచ్చేలా, గట్టిగా బొబ్బలు పెడుతూ అరవడం వచ్చు!

ఇట్లా ఇంకా అనేకానేకం ... వచ్చు!

బ్రహ్మదేవుడు, సరస్వతితో పోట్లాడి, విసుగ్గానూ, కోపంగానూ ఉన్నప్పుడు, మట్టితో చేయడానికి బదులూ తారునీ, కాటుకనీ ముద్దగా పిసికి, మా ఆఫీసర్ని చేసి ఉంటాడు. అందుకే ఆయనంత నలుపూ, మొగంలో అంత విసుగూ!

బస్సు ఆగింది. దిగాను.

ఆలస్యంగా ఆఫీసుకు వచ్చినందుకు ఆఫీసరు కేకల్నీ, ఆయన మొహాన్నీ ఊహించుకుని కదులుతోన్న బస్సు కింద తల పెట్టేద్దామా అని ఆలోచించాను.

మా ఆవిడ పసుపు కుంకుమలూ, మా పిల్లల 'నాన్న' పిలుపులూ నన్ను అసమర్థుణ్ణి చేశాయి.

వేగంగా నడక సాగించాను.

ఆఫీసు దగ్గరవుతూన్న కొద్దీ గుండెల్లో గుబులూ, వెన్నులో వణుకూ మరీ ఎక్కువ అవుతున్నాయి.

అవునూ! ఎందుకీ గుబులూ? ఎందుకీ వణుకూ?

నేనేమన్నా దొంగతనం చేశానా?

ఎవడినన్నా ఖూనీ చేశానా?

ఆఫీసరుకి ఎందుకు భయపడాలసలూ! భయపడను- కానీలే ఏంజేస్తాడూ?

మహా అంటే 'మెమో' ఇస్తాడు...

ఇంకా మహా అంటే 'చార్జి మెమో' ఇస్తాడూ...

ఇవ్వనీ..

ఇక నుంచీ రోజూ ఆలస్యంగా వస్తా...

ఏం చేస్తాడో, ఏమిస్తాడో, అదీ జూస్తా...

అవునూ, ఇదంతా చావు తెలివికి సంబంధించిన ధైర్యమా?

ఆఫీసు వచ్చేసింది. లోపలికి అడుగు పెడుతుంటే ఇందాకటి వీరావేశం నాలో మటుమాయం.

అటెండరు నాగప్ప నవ్వుతూ - "నమస్తే సార్!" అన్నాడు.

నాకు ఒళ్ళు మండింది.

వీడు నవ్వుతున్నదెందుకో నాకు తెలుసు. నన్ను ఆఫీసరు తిట్టబోయే తిట్లను ఊహించుకుని నవ్వుతుంటాడు - రాస్కెల్.

ఆఫీసంతా ఖాళీగా ఉంది!

ఖాళీ కుర్చీలకీ, టేబుళ్ళకీ కాపలా కాస్తున్నట్టు ఎదురుగా గోడవారగా హెడ్‌క్లర్క్ కూచుని ఉన్నాడు.

అతన్ని విష్ చేశాను. 'ఏం సార్! అందరూ మూకుమ్మడి సెలవా?" అడిగాను.

"అబ్బే లేదయ్యా! ఈ రోజు మన ఆఫీసరు సెలవు కదా! దాన్నించి స్టాఫ్ అంతా మహా సంతోషంగా, క్యాంటీన్‌లో కాఫీకని వెళ్ళారు. నువ్వు పో - అట్లే నాకు స్ట్రాంగ్ కాఫీ పంపియ్యమని చెప్పూ!" అన్నాడు హెడ్ గుమాస్తా. మా ఆఫీసుకు ఆఫీసరు పెద్ద మైనస్ పాయింటు అయితే, ఈయన ప్లస్ పాయింటు. ఏ విషయం పట్టించుకోడూ, ఎవర్నీ దండించడు.

నేను కేంటీన్ చేరుకునేటప్పటికే, ఒక టేబుల్ చుట్టూ కూచుని ఉన్నారు మా వాళ్ళు.

ఏదో 'పందెం' అని అంటున్నారొకరు. నన్ను కూడా పందెం వెయ్యమన్నారు. అదేమిటో నాకు తెలీక సర్వర్ తెచ్చిన కాఫీని తాగుతున్నాను.

శివరావు నెమ్మదిగా చెప్పటం మొదలుపెట్టాడు -

"ఆఁ ఏంలేదు రాజూ - పందెం అంతా మన ఆఫీసరు నవ్వు మీదే - మనలో ఎవరైతే ఆయన్ని నవ్విస్తారో వారికి స్టాపు తరపున నూటపదార్లు ఇచ్చుకుని, ఒక పూట మంచి విందు ఇవ్వాలని. ఒకొక్కరికి మూడు ఛాన్సులు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అతను ఓడిపోయినట్లయితే, అందరికి విందు ఖర్చు భరించాలి."

అంతా విన్నాక - "పందెం బాగనే ఉంది. ఆయన్ని నవ్వించడమంటే 'తివిరి ఇసుమున తైలము తీసినట్టే...' ఎవరైనా ముందుకు వచ్చినారా?" అన్నాను.

"మనమే" అన్నాడు శేషగిరిరావు గర్వంగా చూస్తూ.

"సాహసమే!" అన్నాను.

"మనిషి తలుచుకుంటే చేయలేనిది ఏముంది? చంద్రమండలం పైన కాలు మోపలేదా? చూడు, ఒక వారం రోజుల్లో ఆఫీసర్ని నవ్విస్తా, మీ విందు కొట్టేస్తా!" అంటూ కాలరు ఎగరేసి లేచాడు శేషగిరి.

రెండు రోజులు గడిచాయి.

ఆ రోజు పదకొండు గంటలకి స్టాఫ్ మీటింగు వుంది. అందరం ఆఫీసరు ముందు కూచుని ఉన్నాం. శేషగిరి మాత్రం లేడు. 'శేషగిరి ఏడీ?' అంటూ అగ్గి కురిపిస్తున్నాడు ఆఫీసరు. అప్పటికి ఆయనకి వచ్చిన తిట్లన్నీ తిట్టేసి. శేషగిరికి ఆ ఉద్యోగం లేకపోతే బస్టాండులో బఠాణీలు అమ్ముకోడానికి కూడా పనికి రాడని తీర్మానాన్ని పాస్ చేశాడు కేకల్తోనే.

అప్పుడు ఊడిపడ్డాడు శేషగిరి. బాస్ చూస్తున్న చురచుర చూపుల్ని లెక్క చేయకుండా - "శుభవార్త సార్! మీకు ప్రమోషన్ రాబోతోంది!" అన్నాడు.

"అమ్మదొంగ పందెం గెలిచేటట్టున్నాడే" అసాధ్యుడే అనుకున్నాను.

"ఎవరు చెప్పారు నీకు?" అన్నాడు ఆఫీసరు. మొగంలో రవ్వంత కూడా మార్పు రాకుండా.

"మన హెడ్డాఫీసుకి పొయ్యొంటిని సార్! ఏత్రీ గుమాస్తా చెప్పినాడు సార్!" అన్నాడు శేషగిరి ఉత్సాహంగా.

"ఎప్పుడో రావాల్సిన ప్రమోషన్ ఇన్నాళ్ళకి వస్తా వుందన్న మాట!" అంటూ గొణుక్కున్నాడు ఆఫీసరు.

"కంగ్రాట్యులేషన్స్ సార్!" అన్నాం కోరస్‌గా.

"ఆఁ ఏం కంగ్రాట్సో లెండి. అసమర్థులందరికీ ఎప్పుడో ప్రమోషన్లు ఇచ్చారు. ఇంక ఎవరూ దొరక్క నాకు ఇచ్చి ఉంటారు. మన డిపార్టుమెంటులో అంతా దొంగ రాస్కెల్స్ ఉన్నారండీ!" అంటూ సీరియస్‌గా ఆఫీసు విషయాల్లో వెళ్లిపోయాడు. శేషగిరి మొగం కాసింత అయిపోయి వుంది.

ఆ రెండు రోజుల తర్వాత- "ఏమైనా సరే ఈ రోజు ఆఫీసరు నవ్వి తీరాల్సిందే! ఒక కీలకమైన విషయం చెప్పబోతున్నాను" అంటూ ఒక పెద్ద పోజు పెట్టి ప్రకటించేశాడు శేషగిరిరావు.

"ఏం విషయం?" అడిగానే నేను - చాలా ఆసక్తిగా.

"ఊహూ చెప్పను - మీరిక్కడే చెవులు రిక్కించి వింటూ ఉండండి - ఆయన గలగలమని నవ్వేస్తాడు" అంటూనే ఆఫీసరు గదిలోకి దూరాడు శేషగిరి.

మేమంతా పనులు మానుకుని, ఆఫీసరు గది బయటే మకాం వేశాం.

లోపల్నించి సంభాషణ వినబడుతూ వుంది.

"ఈరోజు రిజల్ట్స్ వచ్చినాయి సార్! మీ అమ్మాయిగారివి. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. చాలా సంతోషం సార్! నా కంగ్రాట్స్ తెలియజేయండి సార్! నిజంగా మీ అమ్మాయిగారికి మీ తెలివితేటలే వచ్చినాయి సార్!" అంటూ శేషగిర్రావు గొంతు ఉత్సాహంగా...

"చాల్చాలు లేవయ్యా! నా తెలివితేటలంటున్నావ్! నేను స్కూల్ ఫైనల్‌లో ఫస్ట్ ర్యాంకులో పాసయ్యాను తెలుసా? అది ఆడపిల్ల ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకుంటాదనుకుంటే ఆఫ్టరాల్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యింది. దానికి వచ్చింది నా తెలివి కాదు, వాళ్ళమ్మ తెలివి. ఇద్దో పొరపాటున మా ఇంటికెళ్ళి దానికి

కంగ్రాట్స్ చెప్పేవు - అది ఉబ్బిపోయి ఇక చదువుకోవడం మానేస్తుంది!" అంటూ కరుకు కంఠంతో ఆఫీసరు గొంతు వినబడుతోంది.

ఇదంతా వింటూ మేం ఒకటే నవ్వుకున్నాం.

గదిలోంచి బయటికొచ్చిన శేషగిరి మొహం చూస్తే ఎవరికైనా వైరాగ్యం పుట్టుకొచ్చేలా వుంది.

"అయ్యా! శేషగిరిరావూ, ఎందుకొచ్చిన పందెం చెప్పు! నువ్వు ఎట్లా ఓడిపోక తప్పదు, మాకు విందు ఇచ్చెయ్యి" అన్నాడు కృష్ణమూర్తి అతన్ని మరింత ఉడికించాలని.

"మనకి ఇంకా ఒక ఛాన్స్ ఉంది గురూ! చూస్తూ వుండండి! తప్పక గెలిచి తీరుతాను." అటూ మొక్కవోని ధైర్యంతో అన్నాడు శేషగిరి.

ఇక ఆ రోజు చివరి రోజు. అంటే శేషగిరికి ఇచ్చిన మూడవ ఛాన్స్ ఆవాళ్టితో పూర్తయిపోతుందన్న మాట.

శేషగిరి ఆఫీసుకి వస్తూనే నేరుగా ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు.

ఈలోగా 'అహ్హహ్హ' అంటూ నవ్వులు... ఆఫీసు పనులన్నీ కట్టిపెట్టేసి, ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ, నిశ్చేష్టులమై వింటున్నాము. ఆ తర్వాత కాసేపటికి ఆఫీసరు సీరియస్‌గా బయటికెళ్ళిపోయారు.

"ఏం చేసి నవ్వించావ్!" అంటూ అంతా అతన్ని చుట్టుముట్టాం. అతను సీరియస్‌గా 'ముందు విందు ఇవ్వండి - ఆనక చెబుతా' అన్నాడు. ఆ సాయంత్రం ఒక ప్రసిద్ధ హోటల్లో అతనికి విందు ఇచ్చాం.

"ఇప్పుడయినా చెప్పు గురూ!" అంటూ బతిమాలాం.

"సారీ, ఆఫీసరు నవ్వుతాడు అనుకోలేదు. ఒక రకంగా నాది గెలుపు కాదు, ఓటమే - ప్రయత్నపూర్వకంగా ఆయన్ని నవ్వించలేదు' అన్నాడు బేలగా మొహం పెట్టి.

"అసలు విషయం చెప్పండి - డొంక తిరుగుడు వద్దు. ఆఫీసరు నవ్వాడు దట్సాల్ - నీకు విందు ఇచ్చాం" అంటూ మా హెడ్ గుమాస్తా.

"ఏం లేదు సార్! నేను అనంతపురం నించి ఇక్కడికి రావాలని బస్ ఎక్కుతుంటే, ఆఫీసరు గారి బావమరిది కనిపించాడు - ఆఫీసరు గారి తమ్ముడికి స్కూటర్‌పై వెళుతుంటే చిన్న ఆక్సిడెంట్ అయిందంట. కాలు విరిగిందేమోనని ఆస్పత్రిలో అడ్మిట్ చేశారంట. అది చెప్పమని అన్నారాయన. ఆ మాటే ఆఫీసరుగారికి చెప్పాను. అతనేం విచిత్రం మనిషండీ బాబు. గలగల నవ్వి - నాకు తెలుసు ఆ వెధవకి ఆక్సిడెంట్ అవుతుందని... ఎప్పుడో ఊహించా, వాడి స్పీడే వాడి కాలు విరిచింది అంటూ నవ్వాడు" అని ముగించాడు శేషగిరి.

మా ఆఫీసరు తత్వం ఏమిటో మాకెవరికీ కొరుకుడు పడలేదు.

- ఆంధ్రప్రభ వీక్లీ, 27-2-91.